
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
06-03-2025
పేజీలు: 02

## ఔరంగజేబును పొగిడిన వారిపై చర్యలు చేపట్టాలి

ఔరంగజేబును ప్రశంసించిన మహారాష్ట్రకు చెందిన సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యే అబు అసీమ్ నజ్మీపై ఆ పార్టీ అధినాయకత్వం చర్యలు తీసుకోవాలని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ డిమాండ్ చేశారు.ఆయనపై సమాజ్‌వాది పార్టీ అధినాయకత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. యోగి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో మాట్లాడారు. ఔరంగజేబు... తండ్రి షాజహాన్‌ను ఆగ్రా కోటలో బంధించి కనీసం నీరు కూడా ఇవ్వకుండా వేధింపులకు గురిచేశాడని వెల్లడించారు.

## లాభాల్లో స్టాక్ మార్కెట్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో కదలాడుతున్నాయి. ఉదయం 9:25 సమయానికి నిఫ్టీ 48 పాయింట్లు ఎగబాకి 22,378కు చేరింది. సెన్సెక్స్ 124 పాయింట్లు పెరిగి 73,856 వద్ద ట్రేడవుతోంది.అమెరికా డాలర్ ఇండెక్స్ 104.3 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 69.72 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.32 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 1.12 శాతం లాభపడింది. నాస్‌డాక్ 1.46 శాతం ఎగబాకింది. దేశీ స్టాక్ మార్కెట్లలో ఇటీవల నెలకొన్న ట్రెండ్‌కు పూర్తి విరుద్ధంగా ఇన్వెస్టర్లు భారీ కొనుగోళ్లకు తెరతీశారు. దీంతో మార్కెట్ సూచీలు పెరుగుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లపై వెనక్కి తగ్గవచ్చన్న అంచనాలు సెంటిమెంటుకు జోష్‌నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు.

## ట్రంప్‌కు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు యూఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అందుతున్న నిధులను ట్రంప్ సర్కార్ స్తంభింపజేసిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలపై స్టే విధిస్తూ ఇటీవల ట్రైయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం సమర్థించింది. తాత్కాలిక నిషేధ ఉత్తర్వులను పొడిగించడానికి గడువు ఇప్పటికే ముగిసినందున ఎటువంటి చర్యలు తీసుకోవాలో ట్రయల్ కోర్టులో తేల్చుకోవాలని వైట్‌హౌస్‌కు సూచించింది. ఈ తీర్పుతో నిధుల విడుదలకు అనుమతి లభించినప్పటికీ దీనికి సరైన కాలపరిమితిని నిర్ణయించలేదు. దీంతో ట్రంప్ సర్కార్ దిగువ కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంది. కాగా, వివిధ దేశాల్లోని పలు సంస్థలకు ఆర్థిక సాయం అందించే యూఎస్ ఎయిడ్ (యూఎస్‌ఏఐడీ) సంస్థ ద్వారా అందుతున్న నిధులను స్తంభింపజేస్తూ ట్రంప్ సర్కార్ ఇటీవల నిర్ణయం తీసుకుంది.




## బ్యాంకులకు గుడ్‌న్యూస్ చెప్పిన ఆర్బీఐ

బ్యాంకులకు ఊరటనిచ్చేలా ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.2లక్షల కోట్లు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. సెక్యూరిటీల కొనుగోలు, డాలర్-రూపాయి స్వాప్ వంటి చర్యల ద్వారా నెల రోజుల్లో రూ.1.9లక్షల కోట్లు తీసుకురావాలని భావిస్తోంది. అలాగే ఈ నెల 12, 18 తేదీల్లో రూ.1లక్ష కోట్లకు సమానమైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనుంది.



## తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు

### ప్రధాని నరేంద్ర మోదీ

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ గురువారం ఉదయం ఓ సందేశం విడుదల చేశారాయన. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించి గెలిపించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు. కొత్తగా ఎన్నికైన మా అభ్యర్థులకు అభినందనలు. గొప్ప శ్రద్ధతో పని చేసిన పార్టీ కార్యకర్తలను చూసి నేను గర్విస్తున్నా" అని ఎక్స్ పోస్టులో సందేశం ఉంచారాయన. ఇదిలా ఉంటే.. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలిచారు. ఇక.. ఉత్కంఠ భరితంగా సాగిన ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీగా చిన్నమైల్ అంజిరెడ్డి నెగ్గారు. టీచర్స్ ఎమ్మెల్సీగా కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలవగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్ మాత్రం ఉత్కంఠ భరితంగా సాగింది. చివరకు.. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో అంజిరెడ్డి జయకేతనం ఎగురవేశారు.



# త్వరలో క్యూఆర్ కోడ్‌తో రేషన్ కార్డులు ఇస్తాం

## సివిల్ సప్లైస్ మినిస్టర్ నాదెండ్ల మనోహర్

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఆరవ రోజు కొనసాగుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై శాసన సభలో సివిల్ సప్లైస్ మినిస్టర్ నాదెండ్ల మనోహర్‌ను సభ్యులు ప్రశ్నలు అడిగారు. అక్రమార్కులపై ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారని సభ్యులు అడగగా.. మంత్రి నాదెండ్ల సమాధానం చెప్పారు. గత ప్రభుత్వం వ్యవస్థీకృతంగా పీడీఎస్ రైస్ అంటే.. స్మగ్లింగ్ రైస్‌గా మార్చేశారన్నారు. అక్రమ రవాణా అరికట్టడానికి సివిల్ సప్లైస్ చట్టాలు, పీడీ యాక్టులలో సవరణలు తెచ్చి చట్టాలలో మార్పులు తెచ్చామన్నారు. త్వరలో క్యూఆర్ కోడ్‌తో రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి చెప్పారు. 'రేషన్ బియ్యం కేజీకి 46.10 రూపాయలు ఖర్చు చేస్తున్నాం. 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పీడీఎస్ రైస్ కోసం వినియోగిస్తున్నాము. గత ప్రభుత్వం వ్యవస్థీకృతంగా పీడీఎస్ రైస్ అంటే స్మగ్లింగ్ రైస్‌గా మార్చేశారు. అరికట్టడానికి సివిల్ సప్లైస్ చట్టాలు, పీడీ యాక్టులలో సవరణలు తెచ్చి చట్టాలలో మార్పులు తెచ్చాం. కాకినాడ పోర్టులో 50 వేల మెట్రిక్ టన్నులు సీజ్ చేసి.. 25 మెట్రిక్ టన్నులు పీడీఎస్ రైస్‌గా గుర్తించాం. త్వరలో క్యూఆర్ కోడ్‌తో రేషన్ కార్డులు ఇవ్వబోతున్నాం. ఈకేవైసీ, ఏఐ కెమెరాల సహాయంతో అక్రమ రవాణాను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. 'గత ఐదేళ్ల కాలంలో రేషన్ బియ్యానికి సంబంధించిన లెక్కలు తీస్తున్నాం. పూర్తి వివరాలు రావాల్సిన అవసరం ఉంది. మచిలీపట్నం గోడౌన్లతో పాటు రాష్ట్రంలో కాకినాడ, బేతంచర్ల గోడౌన్లకు సంబంధించి తనిఖీలు జరుగుతున్నాయి. మచిలీపట్నం జెఎస్ వేర్ హౌస్లో తనిఖీ జరిగింది. వారి దగ్గర నుంచి ఇప్పటికే కోటి 70 లక్షల వరకు రికవరీ జరిగింది. ఇంకా అధికారులు విచారణ చేస్తున్నారు. సభ్యులు అడిగిన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుంటాం. త్వరలో అన్ని విషయాలు బయటికి వస్తాయి' అని మంత్రి నాదెండ్ల చెప్పుకొచ్చారు.



## బీహార్ ముఖ్యమంత్రిపై- కీలక వ్యాఖ్యలు చేసిన ప్రశాంత్ కిషోర్

బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూటమి మారతారంటూ ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు ఆయన కూటమి మారడం వంటి నిర్ణయాన్ని ఎంచుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి నితీశ్ కుమార్ పోటీ చేస్తారని తెలిపారు. అయితే ఆయన కాకుండా మరెవరైనా ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయని, కానీ ముఖ్యమంత్రి పదవిపై ఆశతో ఆయన కూటమి మారే ప్రయత్నం చేయవచ్చని వ్యాఖ్యానించారు.నితీశ్ ఏ కూటమిలో ఉన్నప్పటికీ ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా ప్రజలు మాత్రం అంగీకరించరని ఆయన అన్నారు. కూటమి మార్పుపై తాను చెప్పింది జరగకుంటే రాజకీయాల నుండి తప్పుకుంటానని సవాల్ చేశారు. అవసరమైతే తాను రాసిస్తానని వ్యాఖ్యానించారు.



## సచిన్ విధ్వంసం

51 ఏళ్లు వచ్చేసరికి ఏ అథ్లెట్ అయినా.. దాదాపుగా ఆటకు పూర్తిగా దూరమవుతాడు. ఒకవేళ ఛారిటీ కోసమే.. మరే కారణంతో ఆడాల్సి వచ్చినా.. నామమాత్రపు ప్రదర్శన మాత్రమే చేస్తారు. కానీ సచిన్ టెండూల్కర్ అందుకు భిన్నం. 51 ఏళ్ల వయసులోనూ సచిన్.. బ్యాట్‌తో అద్భుతం చేస్తున్నాడు. తనను అందరూ ఎందుకు మాస్టర్ బ్లాస్టర్ అంటారో నిరూపించుకుంటున్నాడు.సచిన్ టెండూల్కర్.. ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ 2025లో భాగంగా ఇండియా మాస్టర్స్ తరఫున బరిలోకి దిగాడు. భారత జట్టుకు కెప్టెన్ కూడా అతడే. ఏడు దేశాల మాస్టర్స్ జట్టు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. ఇందులో ఇండియా మాస్టర్స్‌తో పాటు శ్రీలంక మాస్టర్స్, వెస్టిండీస్ మాస్టర్స్, ఆస్ట్రేలియా మాస్టర్స్, దక్షిణాఫ్రికా మాస్టర్స్, ఇంగ్లాండ్ మాస్టర్స్ జట్లు ఉన్నాయి.

## ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత అడపా మాణిక్యాలరావు గుంటూరు లోని నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దువ్వాడపై కేసు నమోదు చేశారు. మరోవైపు దువ్వాడపై రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు నమోదయ్యాయి. మచిలీపట్నంతో పాటు గుడివాడ, అవనిగడ్డ, తిరువూరు, నిడదవోలు రూరల్ ఠాణాల్లోనూ స్థానిక జనసేన నేతలు దువ్వాడపై ఫిర్యాదు చేశారు. పవన్‌పై ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు
# నారా భువనేశ్వరి భూమి పూజ



నగరంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ ఏర్పాటుకు భూమి పూజ జరిగింది. విజయవాడ టీచర్స్ కాలనీలోని సాయిబాబా గుడి వీధిలో భవన నిర్మాణానికి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శంకుస్థాపన చేశారు. ఏపీలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా కార్యకలాపాలను విస్తరించే లక్ష్యంతో ఈ భవన నిర్మాణం చేపట్టారు. జీప్లస్ 5 అంతస్తులతో అధునాతన భవనాన్ని నిర్మించనున్నారు. ఇదే భవనంలో తలసీమియా కేర్ సెంటర్, రక్త నిధి కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు. సేవాభావంతో సమాజానికి అవసరమైన పనులు చేసేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని నారా భువనేశ్వరి తెలిపారు. రక్తదానంతో పాటు తలసీమియా వ్యాధితో బాధపడే చిన్నారుల్ని ఆదుకునే లక్ష్యంతో ఇక్కడ సేవలు అందిస్తామన్నారు. అత్యవసర వైద్య సేవలకు 24గంటలూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. "2026 ఫిబ్రవరిలో విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు అందుబాటులోకి వస్తాయి. విద్య, వైద్య సేవా కార్యక్రమాలు రాష్ట్రంలో మరింత విస్తృతం చేసే లక్ష్యంతో భవన నిర్మాణం చేపట్టాం. సమాజానికి తిరిగి ఇవ్వాలని దాతృత్వం చాటుకునే వారు మాతో చేతులు కలపాలని కోరుతున్నాం. 25 ఏళ్లుగా నిరంతర సేవలు అందిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా హైదరాబాద్‌లో ప్రారంభమైన ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు వివిధ ప్రాంతాలకు విస్తరిస్తున్నాం. నైపుణ్యం, శిక్షణ ద్వారా మహిళలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నిరుపేద విద్యార్థులు ఎందరికో ఉచిత విద్య అందిస్తున్నాం. ఎక్కడ విపత్తులు వచ్చినా సేవలు అందించేందుకు ట్రస్ట్ ముందుంటోంది. న్యూట్రిఫుల్ యాప్ ద్వారా డైట్ వివరాలు అందిస్తున్నాం. రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని కోరుతున్నా" అని భువనేశ్వరి తెలిపారు.

## జైశంకర్ లండన్ పర్యటనలో
# భద్రతా వైఫల్యం..

**ఒక్కసారిగా దూసుకొచ్చిన ఖలీస్థానీ**



విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లండన్ పర్యటనలో భారీ భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. ఆయన పర్యటనలో ఖలిస్థానీ మద్దతుదారులు దుశ్చర్యకు పాల్పడ్డారు. సెక్యూరిటీని దాటుకుంటూ ఓ దుండగుడు ఏకంగా జైశంకర్ కారుకు అత్యంత సమీపంగా దూసుకొచ్చాడు. లండన్‌లోని ఛాథమ్ హౌస్‌లో పలు అధికారిక సమావేశాలు ముగించుకుని జైశంకర్ బయటకు వస్తున్న సమయంలో కొంతమంది ఖలిస్థానీ మద్దతుదారులు కలకలం సృష్టించారు. నిరసన వ్యక్తం చేస్తుండగా.. ఓ దుండగుడు విదేశాంగ మంత్రి కారు వద్దకు వచ్చి ఘోరావ్ చేశాడు. చేతిలో ఉన్న భారత జాతీయ జెండాను అవమానించేలా ప్రవర్తించాడు. దీంతో అప్రమత్తమైన లండన్ పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడితో పాటు మిగతా ఆందోళనకారులను అక్కడి నుంచి తరిమికొట్టారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెండు రోజుల కిందట యూకే పర్యటనకు వెళ్లిన జైశంకర్ మార్చి 9వ తేదీ వరకు అక్కడే ఉండనున్నారు. తన పర్యటనలో బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్-యూకే వ్యూహాత్మక సహకారం, వాణిజ్యం, విద్య, సాంకేతికత, రాజకీయ రంగాల్లో పరస్పర సహకారం వంటి అంశాలపైచర్చించారు.



# మాకు తమిళ భాషే ముఖ్యం

తమిళనాడులో తమిళ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని తాము కోరుతున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వివరణ ఇచ్చారు. భాషా సమానత్వం కోరడం పక్షపాతం ఎలా అవుతుందని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈమేరకు గురువారం ఆయన ట్విట్టర్ లో పోస్టు పెట్టారు. కేంద్ర నూతన జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. తాము భాషా సమానత్వాన్నే కోరుకుంటున్నామని, పక్షపాతం చూపించమని అడగటం లేదని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్రాంక్లిన్ లియోనార్డ్ చెప్పిన సూక్తిని స్టాలిన్ తన ట్వీట్ లో ప్రస్తావించారు.'మీరు ప్రత్యేక హక్కులకు అలవాటుపడిన తర్వాత.. సమానత్వం అణచివేతలానే కనిపిస్తుంది' అని కోట్ చేశారు. తమిళులపై హిందీ భాషను రుద్దుతామంటే తాము ఒప్పుకోబోమని స్టాలిన్ తేల్చిచెప్పారు. మతోన్మాదాన్ని, పక్షపాతాన్ని తాము కోరుకోవట్లేదని అన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు వర్తించే నేర చట్టాలను హిందీలో రూపొందించారని స్టాలిన్ మండిపడ్డారు. తమిళులకు కనీసం పలకలేని, అర్థం చేసుకోలేని భాషలో ఉన్న చట్టాలు తమకు ఎలా ఉపయోగపడతాయని నిలదీశారు. దీనినే మతోన్మాదం అంటారని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై స్టాలిన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## వీడిన హత్యకేసు మిస్టరీ

హైదరాబాద్‌లోని మలక్‌పేటలో వివాహిత శిరీష హత్య కేసు వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. శిరీష హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు. ఈ కేసులో శిరీష భర్త వినయ్ కుమార్, అతని సోదరి సరిత, మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.మార్చి 1వ తేదీ రాత్రి వినయ్ సోదరి సరిత, శిరీష మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగిందని ఏసీపీ తెలిపారు. శిరీష నర్సుగా పని చేస్తోందని, పలుచోట్ల ఉద్యోగాలు మానేసిందని తెలిపారు. తరుచూ ఉద్యోగాలు మానివేస్తున్నందుకు సరిత నిలదీసింది. "నీ చరిత్ర మొత్తం నాకు తెలుసు. నీ సంగతి తేలుస్తా" అంటూ శిరీష కూడా ఎదురు దాడికి దిగిందని, దీంతో పరస్పరం ఘర్షణ దిగినట్లు తెలిపారు.ఘర్షణ తర్వాత కాసేపటికి, శిరీష తనకు నిద్రపట్టడం లేదంటూ సరిత వద్ద ఉంటే మత్తు ఇంజెక్షన్ అడిగి తీసుకుందని, శిరీష మీద కోపంతో డోసు ఎక్కువగా ఉన్న ఇంజెక్షన్ ఇచ్చిందని ఏసీపీ తెలిపారు. శిరీష మత్తులోకి జారుకున్న తర్వాత దిండుతో ఊపిరాడకుండా చేసి సరిత చంపేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని సరిత తన భర్తకు, సోదరుడికి చెప్పిందని మీడియాకు తెలిపారు.వారు అంబులెన్సును పిలిపించి సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.



## 13 ఏళ్ల బాలుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా
# నియమించిన ట్రంప్

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేసినా సంచలనమే. ఆయన చేసే వ్యాఖ్యలే కాకుండా పనులు కూడా అందరికీ అదే స్థాయిలో ఆశ్చర్యాన్ని కల్గిస్తాయి. ఎప్పటిలాగే తాజాగా ఓ షాకింగ్ నిర్ణయం తీసుకుని దేశం మొత్తం ఆయన వైపు చూసేలా చేసుకున్నారు. ముఖ్యంగా ఓ 13 ఏళ్ల బాలుడిని అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా నియమించారు. తన ఎదుటే అధికారిక బ్యాడ్జీ అందజేయాలని చెప్పగా.. అధికారులు ఆ పని చేశారు. ఆపై బాలుడు యూనిఫామ్ వేసుకుని మరీ.. అధికార బాధ్యతలు చేపట్టాడు. ఇంత చిన్న వయసు కల్గిన బాలుడికి ట్రంప్ ఎందుకీ పదవి కట్టబెట్టారో మనం ఇప్పుడు తెలుసుకుందాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం రోజు 13 ఏళ్ల డీజే డేనియల్‌కు యునైటెడ్ స్టేట్స్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా ఎంపికయ్యే అరుదైన గౌరవాన్ని ప్రదానం చేశారు. తద్వారా ఈ బిరుదును పొందిన అతి చిన్న వయస్కుడిగా డీజే డేనియల్ నిలిచాడు. ట్రంప్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడుతుండగా.. మధ్యలో ఈ ప్రకటన చేశారు. ముఖ్యంగా అక్కడే కూర్చుని ఉన్న డీజే డేనియల్‌ను అధికారికంగా గౌరవ హోదాలో నియమించాలని సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కుర్రాన్‌ను ఆదేశించారు. ట్రంప్ ఆదేశాలతో సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ సీన్ కుర్రాన్ వెంటనే అధికారిక బ్యాడ్జ్ అందజేశారు. ఆపై చిన్నారిని కౌగిలించుకున్నారు. ఈ సమయంలో సభలో డెమోక్రాట్లతో పాటు రిపబ్లికన్లు కూడా ఉండగా.. అంతా కలిసి చప్పట్లు కొట్టారు. డీజే డీజే అంటూనే బాలుడిని గాల్లోకి ఎత్తగా చిన్నారి సైతం తెగ సంబుర పడిపోయాడు. ఆయన తండ్రి కూడా భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

అసలు ఎవరీ డేజీ డేనియల్?

డీజే డేనియల్‌కు ప్రస్తుతం 13 ఏళ్ల వయసు. అయితే ఇతడికి 7 ఏళ్ల వయసు ఉండగా అనారోగ్య సమస్యలు వచ్చాయి. దీంతో బాలుడి తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అతడికి అరుదైన క్యాన్సర్ సోకినట్లు గుర్తించారు. అంతేకాకుండా 5 నెలల కంటే ఎక్కువగా బతకడని చెప్పారు. తీవ్రమైన దుఃఖంతోనే డేనియల్‌ను కాపాడుకునేందుకు అతడి తల్లిదండ్రులు విపరీతంగా కష్టపడ్డారు. గత ఆరేళ్లుగా అతడికి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తూనే.. అతడి కోరికలు తీరుస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాలు తిప్పుతూ బాలుడిని ప్రాణంగా చూసుకుంటున్నారు. అయితే డీజే డేనియల్ చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలని కలలు కన్నాడట. దేశానికి సేవ చేయాలని అనుకునేవాడట. ఈక్రమంలోనే డేనియల్ తండ్రి అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ విషయం చెప్పగా.. ఆయనే నేరుగా బాలుడిని అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా నియమించి.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజల మన్ననలను పొందారు.

## గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు
# భారీ అవకాశాలు

ఏపీలో మద్యం అమ్మకాల పేరిట జరిగిన భారీ కుంభకోణం ముందు ఢిల్లీ స్కామ్ చాలా చిన్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భూఆక్రమణలు, గంజాయి, మాదక ద్రవ్యాలు, అమ్మాయిల అక్రమ సరఫరా వంటి హేయమైన నేరాలకు గత ప్రభుత్వంలో పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం రూపొందించిన రెండు బిల్లులకు ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కోరినట్టు చంద్రబాబు తెలిపారు. ఆయన బుధవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రజలు పూర్తిగా కూటమి వైపే ఉన్నారని చెప్పారు. 'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు బ్యాంకు 60 నుంచి 67.5 శాతానికి పెరిగింది. సంపదను సృష్టించడం, అభివృద్ధి చేయడం, సంక్షేమం, సాధికారికత అనేవి నిరంతర ప్రక్రియ. సంపద పెంచకపోతే ఎలా పంచగలం? అప్పులతో ఆర్థిక సుస్థిరత సాధించలేం. ఏపీలో నాడు జగన్ ప్రభుత్వం, ఢిల్లీలో నిన్నటిదాకా కేజ్రీవాల్ ప్రభుత్వం చేసిన ప్రయోగాలు విఫలమయ్యాయి. దీనినుంచి నేతలు గుణపాఠాలు నేర్చుకోవాలి. గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు భారీ అవకాశాలు ఉన్నాయి.ఎగుమతులు చేసేందుకు అద్భుతమైన పోర్టులు ఉన్నాయి. పరిశ్రమలకు, పెట్టుబడులకు మా రాష్ట్రం స్థావరంగా మారుతోంది. దాదాపు రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పటివరకు ఏపీకి వచ్చాయి' అని తెలిపారు.





# ముంబైలో టెస్లా తొలి షోరూమ్

లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. తన తొలి షోరూమ్‌ను దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు బుధవారం వెల్లడించాయి. సీఆర్ఈ మ్యాట్రిక్స్ వివరాల ప్రకారం.. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారు. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసింది. ఎలన్ మస్క్ సారథ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం. మోదీతో భేటీ అయిన రోజుల వ్యవధిలోనే టెస్లా ఈ చర్యలు చేపట్టడం విశేషం. ఇక భారత్‌లో తొలి రెండు షోరూమ్‌లను ఏర్పాటుకు దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాలను సంస్థ ఎంపిక చేసింది. ఇటీవలే నియామకాల ప్రక్రియ కూడా చేపట్టింది. కస్టమర్ రిలేటెడ్, బ్యాక్‌ఎండ్ జాబ్ సహా 13 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు కావాలంటూ ప్రకటన ఇటీవలే చేసింది. ఇందులో సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతున్నట్లు తెలిపింది. మిగిలిన పోస్టులకు ఉద్యోగులను కేవలం ముంబై కేంద్రంగా తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొంది.